క్లుప్తంగా

బాడీ బిల్డింగ్‌లో జగదీష్‌కు ద్వితీయ స్థానం



విద్యార్థి జగదీష్‌కు ట్రోఫీ అందజేస్తున్న కళాశాల కరస్పాండెంట్ మధుకుమార్

సీతంపేట: గైన్స్ ఫిట్‌నెస్ క్లబ్ నిర్వహించిన మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్-2023 పోటీల్లో లంకపల్లి బుల్లయ్య కళాశాలకు చెందిన విద్యార్థి వి.జగదీష్ 85 కిలోల విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా బుధవారం జగదీష్‌ను కళాశాల కరస్పాండెంట్ జి.మధుకుమార్ అభినందించి ట్రోఫీని అందజేశారు. కళాశాల ప్రిన్సిపాళ్లు జి.ఎస్.కె.చక్రవర్తి, డి.దీపక్ చౌదరి, కె.సోమేశ్వరరెడ్డి, వ్యాయామ విభాగాధిపతి వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ బి.ఆర్.ఎస్.లక్ష్మణ్‌రెడ్డి అభినందనలు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మురళీనగర్: మర్రిపాలెం సెక్షన్ పరిధిలోని ఇందిరానగర్, కప్పరాడ 11 కేవీ ఫీడర్ల నిర్వహణ పనులు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్-2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అరుంధతి నగర్, జయప్రకాష్‌నగర్, బాపూజీనగర్, తిక్కవానిపాలెం, సంజీవయ్య కాలనీ, అప్పర్ జయప్రకాష్‌నగర్, కప్పరాడ, రాంజీ ఎస్టేట్, కొత్తూరు, ఇందిరానగర్ 1-5, జయప్రకాష్‌నగర్-1 ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

సీనియర్ సభ్యులకు సత్కారం



సీనియర్ సభ్యులను సత్కరిస్తున్న కమిటీల ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెం గౌరీ గ్రామ సేవా సంఘం, హనుమాన్ సీతారామాలయాల్లో తమ వంతు సేవలందించిన 60 ఏళ్లు నిండిన సభ్యులను ఘనంగా సత్కరించారు. 2023లో జరిగిన వివిధ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు, నగదు పారితోషికాలను అందజేశారు. గవర తాటిచెట్లపాలెంలోని హనుమాన్ సీతారామాలయంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించినట్లు కమిటీల ప్రతనిధులు తెలిపారు. ముఖ్య అతిథులుగా కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్, బుద్ద శివాజీ హాజరయ్యారు. నార్త్ బీసీ సెల్ అధ్యక్షుడు బొడ్డేటి గంగామహేష్, గవర తాటిచెట్లపాలెం గౌరీ సేవా సంఘం, హనుమాన్ సీతారామాలయం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా కాలువ పనులు



నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో కాలువ నిర్మిస్తున్న కార్మికులు

సీతమ్మధార: జీవీఎంసీ14వ వార్డు నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో పలు అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇటీవల మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రాజు సుమారు రూ.2.53 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం కాలువ పనులు జరుగుతున్నాయి. నార్త్ ఎక్స్‌టెన్షన్ రోడ్డులో అభివృద్ధి పనులు పూర్తయితే నియోజకవర్గ రూపురేఖలు మారిపోతాయి.

ప్రగతిలో ముందుకు..

- 53వ వార్డులో శరవేగంగా పనులు
- రోడ్లు, గెడ్డలు, డ్రెయిన్ల నిర్మాణాలు

మర్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు అభివృద్ధిలో దూసుకుపోతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో జీవీఎంసీ స్మార్ట్ సిటీ దిశగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ వార్డులోని పలు ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు, డ్రైనేజీలు, ఇతర నిర్మాణాల పనులు జోరుగా సాగుతున్నాయి. ఇందుకోసం రూ.5 కోట్ల నిధులు మంజూరయ్యాయి. రూ.3 కోట్లతో ప్రారంభించిన పనుల్లో కొన్ని పూర్తయ్యాయి. రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు, గెడ్డల నిర్మాణాలు ముగింపు దశకు చేరుకున్నాయి. శివనగర్‌లో కోటి రూపాయలతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రజలకు అనేక వైద్య సేవలందిస్తోంది. రూ.2 కోట్ల విలువైన పనులు టెండర్ దశలో ఉన్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజా వినతుల పరిష్కారంలో భాగంగానే జీవీఎంసీ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టారు.



గ్రీన్ గార్డెన్స్-పార్వతీనగర్ వద్ద నిర్మిస్తున్న కల్వర్టు

అభివృద్ధి పనుల వివరాలు

- వార్డులోని శ్రీరామ్‌నగర్ గెడ్డ అడుగు భాగంలో రూ.19 లక్షలతో కాంక్రీట్ పనులు నిర్వహిస్తున్నారు.
- గ్రీన్ గార్డెన్స్ నుంచి పార్వతీనగర్ వెళ్లే మార్గంలో రూ.10 లక్షలతో గెడ్డ మీద కల్వర్టు పనులు జరుగుతున్నాయి.
- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన రూ.20 లక్షల నిధులతో ప్రజల వినతుల మేరకు భాస్కర్ గార్డెన్స్-1, 2 ప్రాంతాల్లో బీటీ రోడ్ల నిర్మాణం పూర్తి చేశారు.
- మొహిద్దీన్ గార్డెన్స్‌లో రూ.6 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించారు.
- జాకీర్‌హుస్సేన్ నగర్ గెడ్డ ఆధునికీకరణకు గాను రూ.6 లక్షలు కేటాయించి పనులు ప్రారంభించారు. ఇప్పటికే గెడ్డను జీవీఎంసీ సిబ్బంది శుభ్రం చేశారు.
- హుస్సేన్ నగర్‌లో డ్రెయిన్ల పనులు పూర్తయ్యాయి.
- సాయినగర్‌లో డ్రెయిన్ల నిర్మాణం త్వరలోనే ప్రారంభిస్తారు.

ఈ పనులన్నీ పూర్తయితే వార్డు సరికొత్త శోభను సంతరించుకుంటుంది. రోడ్లు, కాలువలు, కల్వర్టులు, గెడ్డల ఆధునికీకరణ, మౌళిక సదుపాయాల కల్పన పనులు చకచకా జరుగుతుండటంతో వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



శ్రీరామ్‌నగర్‌లో నివాసాల మధ్య నిర్మిస్తున్న గెడ్డ

వార్డు అభివృద్ధే లక్ష్యం



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ఎన్నడూ లేని విధంగా జీవీఎంసీ వార్డులను అభివృద్ధి చేస్తున్నారు. మా వార్డు అభివృద్ధి పనుల్లో భాగంగా రూ.5 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని జాకీర్‌హుస్సేన్ నగర్, శ్రీరామ్‌నగర్ వంటి కాలనీల్లో అనేక పనులు చేపడుతున్నాం. వార్డు అభివృద్ధి లక్ష్యంగా కృషి చేస్తున్నాను.

– బర్కత్ అలీ, కార్పొరేటర్, 53వ వార్డు

వర్షాకాలం.. అప్రమత్తత అవసరం

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ
- జోన్-3లో క్షేత్రస్థాయి పర్యటన

సీతమ్మధార: వర్షా కాలం దృష్ట్యా నగరంలోని ప్రధాన కాలువలతోపాటు చిన్న చిన్న కాలువలను ప్రతి రోజూ శుభ్రం చేయాలని ప్రజారోగ్య అధికారులను జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ ఆదేశించారు. జోన్-3 పరిధి 14వ వార్డులోని సీతమ్మధార, రామకృష్ణరాజునగర్, బాలయ్యశాస్త్రి లేఅవుట్, పోర్టు స్టేడియం పరిసర ప్రాంతాల్లో బుధవారం కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజుతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డులో పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించడం లేదని, చెత్త కుప్పలు ఎక్కడికక్కడ కనిపిస్తున్నాయని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసి, వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. యూజీడీ కనెక్షన్లతోపాటు అల్లూరి సీతారామరాజు విగ్రహం జంక్షన్ వద్ద కల్వర్టు మరమ్మతులను వారం రోజుల్లోగా పూర్తి చేయాలని, రామకృష్ణనగర్‌లో కల్వర్టు నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని, పోర్టు అధికారులతో మాట్లాడి నరసింహనగర్ రైతుబజార్ రోడ్డును 60 నుంచి 80 అడుగులకు విస్తరించేలా చూడాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు.



బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో పర్యటిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ, కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రాజు, అధికారులు

ఆకర్ష జోన్ ఏర్పాటు చేయండి

23వ వార్డు పరిధిలోని సీతమ్మధారలో కమిషనర్ సాయికాంత్ వర్మ పర్యటించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలం నుంచి రైతుబజార్ వరకు ఆకర్ష జోన్ ఏర్పాటు చేసి తోపుడు బళ్ల వ్యాపారులకు కేటాయించాలని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు ఆదేశించారు. పర్యటనలో టౌన్ ప్లానింగ్ అధికారి సునీత, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, ఈఈ సత్యనారాయణరాజు, ఏఎంహెచ్‌వో రాజేష్, కార్యనిర్వాహక ఇంజినీర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన కూరగాయలే విక్రయించాలి

సీతమ్మధార: రైతుబజారులో ఎవరైనా డ్రాలో మీకు స్టాల్ వచ్చేలా చేస్తానని చెప్పిన తక్షణమే తమకు సమాచారమివ్వాలని జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ యాసిన్ సూచించారు. సీతమ్మధార రైతుబజారును బుధవారం ఆయన సందర్శించారు.

రైతుల స్టాళ్ల వద్దకు వెళ్లి ఐడీ కార్డులను, ఉల్లిపాయలు, టామాటాల నాణ్యతను, ధరల పట్టికలను పరిశీలించారు. యాసిన్ పర్యవేక్షణలో రైతుల స్టాళ్లకు డ్రా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరల ప్రకారం నాణ్యమైన కూరగాయలను విక్రయించాలని సూచించారు. సమస్యలేమైనా ఉంటే తక్షణమే 73311 54978 నంబర్‌కు కాల్ చేయాలని రైతులతో సూచించారు. ప్రతి వారం రైతుల స్టాళ్లకు తానే వచ్చి డ్రా తీస్తానని చెప్పారు. కార్యక్రమంలో రైతుబజార్ ఈవో కొండబాబు, సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.



స్టాల్ టోకెన్ అందిస్తున్న షేక్ యాసిన్

హిందూ ధర్మంలో రైతులదే అగ్రస్థానం

సీతంపేట: సనాతన హిందూ ధర్మంలో రైతులే అగ్రస్థానంలో ఉన్నారని, వారిని తగిన విధంగా ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందని హిందూ ధర్మ ప్రచారకుడు మనోహర్ దాస్ అన్నారు. ద్వారకానగర్ బీవీకే కళాశాలలో బుధవారం జరిగిన మిషన్ కర్షక దేవోభవ ప్రచారం కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. పూర్వం రాజులు అన్నదాతలకు అండగా నిలిచేవారని, నేడు పాలకులు వారిని అత్యంత నిర్లక్ష్యంగా చూస్తున్నారన్నారు. కార్యక్రమ నిర్వాహకుడు ఆడారి కిషోర్‌కుమార్ మాట్లాడుతూ రైతుల జీవనాన్ని పాఠ్యాంశంగా చేర్చితే రైతు శ్రమ, విలువ విద్యార్థి దశ నుంచే తెలుస్తాయన్నారు. యోగి ప్రభాకర్ జీ మాట్లాడుతూ తినే ముందు రైతులకు ధన్యవాదాలు తెలియజేయడం కనీస ధర్మమన్నారు. వారికి సమాజంలో అత్యున్నత స్థానం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న మనోహర్ దాస్

'మయన్మార్' అసోసియేషన్ సేవలు అభినందనీయం

కంచరపాలెం: మయన్మార్ ఆంధ్ర రీపాట్రియేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 10వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. జాతీయ రహదారి ఊర్వశి జంక్షన్‌లోని స్టీల్ సిటీ క్యాంప్‌లో అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.ఎం.ఫ్రెడ్డి, కార్యదర్శి డి.ఆర్.మోహన్‌రావుల నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సంఘంలో సభ్యులుగా ఉన్న రిటైర్డ్ ఉద్యోగులంతా ఉత్సాహంగా గడిపారు. ముఖ్య అతిథులు బి.ప్రభు, కాళ్ల ఈశ్వరప్రసాద్, పి.సుకుమార్ జ్యోతిప్రజ్వలన చేసి దశాబ్ది వేడుకలు ప్రారంభించారు. ఉచిత వైద్య శిబిరాలు, పేదలకు నిత్యావసర సరకుల పంపిణీ, కేరళలో ఫ్లడ్ రిలీఫ్ ఫండ్, బర్మాలో కోవిడ్ రిలీఫ్ ఫండ్ వంటి అసోసియేషన్ చేస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని వారు కొనియాడారు. సంఘ సభ్యులు ఎవరైనా మరణిస్తే రూ.2,500 సాయం అందజేయనున్నట్లు ఎ.ఎం.ఫ్రెడ్డి తెలిపారు. సంఘ సభ్యులకు మెమెంటోలు అందించి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో డి.కృష్ణారావు, ఎం.పి.బాపూజీరావు, డి.ప్రకాష్, వి.ఎస్ మణి, బాబురావురెడ్డి, కె.నాగేశ్వరరావు, ఎండీ దీన్, కె.రాజారావు, పి.కె.సూర్యనారాయణ, బి.ఈ.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



సభ్యుడిని సత్కరిస్తున్న అతిథులు, అసోసియేషన్ ప్రతినిధులు

డీఎంహెచ్‌వో దృష్టికి ఆశా కార్యకర్తల సమస్యలు

మహారాణిపేట: తమ గోడు చెప్పడానికి వెళ్లిన ఆశా కార్యకర్తలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు చులకన భావంతో వ్యాఖ్యలు చేశారని, తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ బుధవారం వారు డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకురాలు పి.మణి మాట్లాడుతూ ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని కోరగా.. డీఎంహెచ్‌వో ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఏఎన్‌ఎంల పనులు, ఇతర శాఖల సిబ్బంది పనులను కూడా ఆశా కార్యకర్తలు చేత చేయిస్తున్నారని డీఎంహెచ్‌వో దృష్టికి ఆమె తీసుకొచ్చారు. ఎన్ని చెప్పినా ఆయన వినకుండా తన ధోరణిలో ఏదో మాట్లాడటంతో ఆగ్రహించిన ఆశా కార్యకర్తలు కార్యాలయం ఎదుట బైఠాయించారు. డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు బయటకు వచ్చి మాట్లాడటంతో వారు శాంతించారు. ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇవ్వడంతో ఆశా కార్యకర్తలు నిరసన విరమించి వెళ్లిపోయారు.

ఇంటర్ కాలేజ్ పోటీల్లో ఏఎంసీ విద్యార్థుల ప్రతిభ

విజేతలకు ప్రిన్సిపాల్ అభినందన

మహారాణిపేట: మంగళగిరిలోని ఎయిమ్స్‌లో 5వ కొలోక్వియంలో భాగంగా నిర్వహించిన ఆలిండియా అంతర్ కళాశాలల పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఆంధ్ర మెడికల్ కళాశాల విద్యార్థులను ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు అభినందించారు. ఈ పోటీల్లో ఏఎంసీ నుంచి మొదటి సంవత్సరం విద్యార్థులు 12మంది పాల్గొనగా అనాటమీ మోడల్‌లో డి.సాయి వైష్ణవి బంగారు పతకం, అనాటమీలో డి.వి.రంగనాథ్ రజతం, జి.రోష్ని కాంస్య పతకాలు గెలుచుకున్నారు. కళాశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో విజేతలను ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో ఏఎంసీ అనాటమీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.రవీంద్ర కిషోర్, ఫిజియాలజీ విభాగాధిపతి డాక్టర్ పద్మ గీతాంజలి, బయోకెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ వి.భవాని తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

ఫొటోగ్రఫీ ప్రదర్శన పోస్టర్ ఆవిష్కరణ

ఏయూ క్యాంపస్: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని వాల్తేర్ ఫొటోగ్రఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ ప్రదర్శన జరగనుంది. ఈ నెల 19, 20 తేదీల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రాంగణంలో నిర్వహించే ఈ ప్రదర్శన వివరాలతో కూడిన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పి.ఎస్.సేతు, కార్యదర్శి ఎం.వి.శ్రీనివాసరెడ్డి, కోశాధికారి వి.వి.రామరాజు, సభ్యులు కె.ఎం.కె.రమేష్, సన్నీ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

సమాజంపై చలం రచనల ప్రభావం



మాట్లాడుతున్న కుప్పిలి భీమేశ్వరరావు

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ప్రసంగ కార్యక్రమంలో 'చలం జీవితం, సాహిత్యం' అనే అంశంపై రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయుడు కుప్పిలి భీమేశ్వరరావు ప్రసంగించారు. మహిళల జీవితాలను ఇతివృత్తంగా చేసుకుని వారికి స్వేచ్ఛ అవసరమని, సమాజంలో వారికి ఎదురయ్యే శారీరక, మానసిక హింసను చలం తన రచనల్లో ఎత్తిచూపారన్నారు. శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ చలం రచనలు 1920-50 మధ్య సమాజాన్ని ప్రభావితం చేశాయన్నారు. ఆయన రచనల్లో విశృంఖలత్వం వల్ల చాలా మంది పాఠకులు వాటిని నిరసించారని తెలిపారు. డాక్టర్ కె.జి.వేణు కార్యక్రమాన్ని సమీక్షించారు. సాహితీవేత్తలు, రచయితలు డి.వి.సూర్యారావు, కృష్ణబాబు, కె.వి.ఎస్.మూర్తి ప్రసంగాలు ఆకట్టుకున్నాయి.

అనధికార నిర్మాణాల తొలగింపు



అక్రమ నిర్మాణాన్ని అధికారుల పర్యవేక్షణలో తొలగిస్తున్న సిబ్బంది

సీతమ్మధార: జీవీఎంసీ జోన్-3 పరిధిలోని పలు వార్డుల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను బుధవారం పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు తొలగించారు. జీవీఎంసీ కమిషనర్, సీసీపీ, డీసీపీల ఆదేశాల మేరకు చర్యలు చేపట్టారు. టీపీవో తేజ, అనిత పర్యవేక్షణలో అశోక్‌నగర్, సీతమ్మధార, సీతంపేట తదితర ప్రాంతాల్లో అనధికారంగా నిర్మించిన భవనాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఎటువంటి అక్రమ నిర్మాణాలు చేపట్టినా.. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జోన్-3 పరిధిలో ఎక్కడైనా వాల్‌పోస్టర్లు అతికిస్తే వారికి జరిమానాలు విధిస్తామన్నారు.

సింహగిరిపై అధికారుల పర్యటన

సింహాచలం: సింహగిరిపై పలు నిర్మాణాలు చేపట్టేందుకు అనువైన ప్రదేశాలను గుర్తించడానికి బుధవారం ఏయూ విశ్రాంత ప్రధాన ఇంజినీర్ డాక్టర్ జి.మాధవ్, దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులు, ట్రస్టుబోర్డు సభ్యులు పర్యటించారు. సుమారు రూ.4 కోట్లతో కార్ల పార్కింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించి గజపతి కాటేజీ వెనుక వైపు ఉన్న స్థలాన్ని పరిశీలించారు. ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ నిర్మాణం, అన్నప్రసాద సత్రంపై ప్రసాదాల తయారీకి అదనపు అంతస్తు నిర్మాణం తదితర ప్రణాళికపై చర్చించారు. దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు, ట్రస్టుబోర్డు సభ్యులు సంపంగి శ్రీనివాసరావు, వారణాసి దినేష్‌రాజ్ పాల్గొన్నారు.

గౌతు లచ్చన్నకు ఘన నివాళి

దాబాగార్డెన్స్: స్వాతంత్ర్య సమర యోధుడు సర్దార్ గౌతు లచ్చన్న స్మారక భవనాన్ని విశాఖలో ఏర్పాటు చేయాలని శ్రీశయన సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు తోట వాసుదేవరావు కోరారు. గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా జడ్జి కోర్టు సమీపంలోని లచ్చన్న కాంస్య విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తోట మాట్లాడుతూ విశాఖలో గౌతు లచ్చన్న విగ్రహం ఏర్పాటు అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, మంత్రి ధర్మాన ప్రసాదరావు చొరవేనన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి షీలానగర్ నుంచి అనకాపల్లికి వెళ్లే దారిలో 5 ఎకరాల స్థలంలో స్మారక భవనం, 100 అడుగుల విగ్రహం ఏర్పాటు చేసి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో తోట హరిశంకర్, దొంపక భాస్కర్, వెంకటరమణ, జలుమూరు చిట్టిబాబు, మార్కండేశ్వరరావు, అత్తిలి శంకర్రావు, ఎం.ప్రసాద్ పాల్గొన్నారు.



గౌతు లచ్చన్న విగ్రహం వద్ద మాట్లాడుతున్న వాసుదేవరావు

ఘనంగా దుర్గాగణపతి ఆలయ వార్షికోత్సవం

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట కూడలిలోని దేవదాయ శాఖ పరిధి దుర్గాగణపతి ఆలయ 31వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే స్వామికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు జరిపారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి, శ్రీనివాస్ దంపతులు దుర్గాగణపతిని దర్శించి పూజలు చేశారు. వారికి కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాన్ని దర్శించి అభిషేకాలు, అర్చనలు జరిపించారు. ఆలయ అర్చకుడు నటరాజన్ పర్యవేక్షణలో గణపతి హోమం, మహాభిషేకం, ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. సాయంత్రం 108 కలశాలతో దుర్గాగణపతి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలతో పల్లకీలో ఊరేగించారు. అడుగడుగునా భక్తులు టెంకాయలు కొట్టి, హారతులిచ్చి స్వామికి నీరాజనాలు పలికారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



ఉత్సవమూర్తుల ఊరేగింపులో పాల్గొన్న మేయర్ హరివెంకటకుమారి దంపతులు, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

'జగనన్న సురక్ష'తో 16,550 మందికి సర్టిఫికెట్లు

సీతమ్మధార: వివిధ సర్టిఫికెట్ల కోసం వార్డు సచివాలయం, మీ సేవ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ ఆనంద్‌కుమార్ తెలిపారు. బుధవారం 'సాక్షి'తో ఆయన మాట్లాడుతూ కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే వెంటనే అందజేస్తామన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో నేరుగా తమ వద్దకు వచ్చి సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు. ఎవరికీ డబ్బులు ఇవ్వనవసరం లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 17,185 దరఖాస్తులు రాగా.. 16,550 మందికి సర్టిఫికెట్లు అందజేశామని చెప్పారు. 168 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరగా పూర్తి చేస్తామని తహసీల్దార్ అన్నారు.



తహసీల్దార్ ఆనంద్‌కుమార్

దేశభక్తిని అలవర్చుకోవాలి

సీతంపేట: భారత్ వికాస్ పరిషత్ విశాఖపట్నం శాఖ, ఝాన్సీ లక్ష్మీబాయి నారీ శాఖల ఆధ్వర్యంలో బుధవారం అక్కయ్యపాలెంలోని ఒక ప్రైవేటు స్కూల్‌లో వికాస్ సప్తాహ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. పరిషత్ ప్రాంత అధ్యక్షుడు వంకాయల సన్యాసిరాజు జ్యోతి వెలిగించి మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలకు నిలయంగా భారతదేశం విరాజిల్లుతోందన్నారు. ప్రతి విద్యార్థి భక్తి, దేశభక్తిని అలవర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సమాజంలో సంస్కృతి అనే అంశంపై రచయిత శేఖరమంత్రి ప్రభాకర్, మన భారతీయం అనే అంశంపై వై.సత్యారావు మాస్టర్ ప్రసంగించారు. కార్యక్రమంలో పరిషత్ నగర అధ్యక్షుడు పంపాన వెంకటేశ్వరరావు, జాతీయ స్థాయి ప్రతినిధి రమేష్‌చంద్ జైన్, ప్రాంతీయ స్థాయి ప్రతినిధి ఎం.వి.రాజశేఖర్, ఝాన్సీ లక్ష్మీబాయి శాఖ అధ్యక్షులు సత్యశ్రీ, ఎం.శైలజ, మాణిక్యాలరావు పాల్గొన్నారు.



వికాస్ సప్తాహ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వంకాయల సన్యాసిరాజు

నేడు సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసీదళార్చన నిర్వహించనున్నారు. భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806091లో రుసుం చెల్లించాలి.

విశ్వదేవుడు ఒక్కడేనని బోధించే 'బ్రహ్మం సువిష్ణు'

దాబాగార్డెన్స్: బ్రహ్మం సువిష్ణు సినిమా ప్రీమియర్ షోలు దేశ వ్యాప్తంగా ప్రదర్శిస్తున్నట్లు బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం మల్టీ మీడియా చైర్‌పర్సన్ కరుణాభాయ్ తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తాను 1971 నుంచి మీడియా రంగంలో ఉన్నానని, 87 ఏళ్లుగా తమ సంస్థ 147 దేశాల్లో సనాతన ధర్మం కోసం కృషి చేస్తోందన్నారు. బ్రహ్మకుమారీ సంస్థ.. ఆధ్యాత్మిక సంస్థని పేర్కొన్నారు. ప్రేమ, సంతోషం కోసం అన్వేషణ సాగుతోందని, విద్యా సంస్థల్లో వీటిని బోధించడం లేదన్నారు. చిత్ర డైరెక్టర్ ముప్పలనేని శివ మాట్లాడుతూ తాను తెలుగులో తాజ్‌మహల్, సంక్రాంతి వంటి 20 సినిమాలు తీశానని గుర్తు చేశారు. బ్రహ్మం సువిష్ణు సినిమా అందరినీ ఆకట్టుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సినిమా షూటింగ్ అంతా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో జరిగిందని, పాన్‌ఇండియాలో భాగంగా ముందుగా హిందీలో విడుదల కానుందని, గంటన్నర నిడివిలో సినిమా ఉంటుందన్నారు. విశ్వదేవుడు ఒక్కడే అన్నది ఈ సినిమా సారాంశంగా పేర్కొన్నారు. త్వరలోనే సృష్టి అంతమవుతుందని చిత్రంలో చూపించామని వివరించారు. బ్రహ్మ పాత్రధారి అరుణ్‌బాయ్ మాట్లాడుతూ ఈ సినిమాలో బ్రహ్మ రహస్యాలు చక్కగా చిత్రీకరించామన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ రమా, బీకే శివలీల, సరళ భాయి తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మం సువిష్ణు సినిమా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కరుణాభాయ్ తదితరులు